# అయినవాళ్ళు

## కె. గోదావరిశర్మ



సాయంకాలం అయిదు దాటాక రోడ్లన్నీ గృహాభిముఖంగా ఒరుగుతాయి వాలుతలం మీద వస్తువులు జారినట్టు రోజంతా ఆఫీసుల్లో బాధ్యతలకు మేకుబందీలైన నీరసప్రాణులు మెల్లగా శరీరాల్ని ఇళ్ళకి చేరవేస్తారు వాళ్ళలో కొందరికి ఇంటి కంటె ఆఫీసు పదిలం వాళ్ళు ఆఫీసు వదిలి ఇంటికి వెళ్ళడమంటే పొగలోంచి సెగలోకి వెళ్ళడం లాంటిది అలాంటి ఒక-చిరుద్యోగి మూర్తి

మూర్తి చిన్నప్పటి రికార్డు చాలా క్లీన్‌గా ఉంది అతను బుద్ధిమంతుడనీ, ఈ కాలం పిల్లలందరిలాంటి వాడు కాడనీ, పెద్దల యెడ వినయ విధేయతలు గలవాడనీ చిరుతప్రాయంలోనే ప్రశంసలు పొందేడు అవే ఇప్పుడు ఉచ్చులై అతని మెడకి బిగుసుకున్నాయి 'మంచివాడు' అనే బిరుదు నిలబెట్టుకోవడానికి కొంత, ఎవరినీ ఎదిరించి సమాధానం చెప్పలేని మెతకదనం కొంత, అడుగడుగునా అతణ్ణి అసమర్థుడిగా, అప్రయోజకుడిగా నిరూపిస్తున్న పరిస్థితులు కొంత – వెరసి మూర్తి ఒక మధ్యతరగతి మానవుడు అంచేత ఆఫీసు అయిపోయాక క్లబ్బుల వెంట, స్నేహితులతో షికార్లకీ తిరగడం అతని జాతకంలో లేదు అయిదున్నర అయేసరికి యాంత్రికంగా బలిపీఠం మీదకి అడుగు పెట్టవలసిందే, ఆ రోజు కోటా హాలాహలాన్ని కంఠస్థం చెయ్యవలసిందే

ఆ రోజు కూడా ఎప్పటిలాగే అయిదున్నరకి ఇల్లు చేరుకున్నాడు మూర్తి ఎప్పటిలాగే ఇల్లు సందడిగా, కోలాహలంగా ఉంది – ఏడుపులు, చాడీలు, ఫిర్యాదులతో సమయానుకూలంగా చెవుడు నటించడం ఈ మధ్యే నేర్చుకున్నాడు మూర్తి అతడి నుద్దేశించి తల్లి, భార్య, పిల్లలు ఆడే మాటలన్నీ ప్రజల్ని చేరుకోని ప్రజాకవిత్వంలా గమ్యాన్ని చేరడం లేదు

పరీక్ష పీజు కట్టడానికి రేపే ఆఖరు రోజట మీ తమ్ముడు గుర్తు చెయ్యమన్నాడు అంది భార్య, కాఫీ గ్లాసు అందిస్తూ

కాఫీ కషాయంలా ఉంది మూర్తి మాట్లాడలేదు

మీరేమో ఏమీ చెప్పరు ఆ అబ్బాయి నన్ను వేధించుకు తింటాడు – అన్నయ్యని నువ్వడుగు, ఒదినా అని నిష్ఠూరంగా అంది లత పెళ్ళికి ముందు ఆమెకి ఆ పేరు చక్కగా నప్పేది ఇప్పుడు తన పేరు చెప్పుకోవడానికేసిగ్గు పడుతుంది లత

మూర్తి విసుక్కున్నాడు పరీక్ష ఫీజు కట్టకపోతే కొంపేమీ మునిగిపోదులే రాయడమే గాని ఎప్పటికైనా పాసవ్వాలా ఏమన్నానా? అన్నాడు

మెల్లిగా మాట్లాడండి అత్తగారు వింటే బాధ పడతారు వారించింది లత అలా అని పరీక్షకి పంపడం మానెయ్యలేం కదా! ఏమో, ఈ సారి గట్టెక్కేస్తాడేమో! అంది ఆశగా

ఆఁ! ఆఁ! దానికంటె భాగ్యలక్ష్మి లాటరీలో ఫస్టు ప్రైజు రావడం సులువు, నిట్టూర్చి కుర్చీలోంచి లేచాడు మూర్తి

ముసలావిడ గుమ్మం దగ్గరే ఉంది వెంటనే అందుకుంది – బావుందిరా వరస! తోడబుట్టిన వాడికి అదన్నమాట నువ్వు చేసే సాయం! అంది తన సహజ ధోరణిలో

నేను చెయ్యగలిగినదేదో నేను చేస్తూనే ఉన్నాను కాని బాగుపడే ఉద్దేశం వాడికి ఏ కోశాన్నైనా ఉంటే కదా! చిరాగ్గా అన్నాడు **మూర్తి**

అయితే ఏమిటి, పరీక్ష తప్పడం వాడికి సరదా ఏమిట్రా? వాడి రోజులు బాగులేవు ఆ గ్రహశాంతి ఏదో చేయిస్తే బావుణ్ణంటే నువ్వీ మధ్య మాట వినిపించుకోవడమే మానేసేవు! వాడు బాగానే రాస్తున్నాడు, గాని ఆ పేపర్లు దిద్దడంలోనో

రిజల్సులోనో బోల్తా కుమ్మక్కులట!' కొడుకు పేపర్లో ఏం రాశాడో తను చూసినట్టు, యూనివర్శిటీ పరీక్షల వ్యవహారమంతా తనకి తెలిసినట్టు అందావిడ వెంటనే మళ్లీ కంటిన్యూ చేసింది ఆ పరీక్ష ఏదో గట్టెక్కితే వాడూ ఓ ఉద్యోగం చూసుకుపోతాడు రాజాలాగ! ఇలాగ మాటలు పడుతూ ఈ పంచనా ఆ పంచనా ఉండడం వాడికేం ఖర్మ, గ్రహచారం కాకపోతే! అని ముద్దుల మూడో కొడుకుని వెనకేసుకొచ్చింది

పూర్వం అలాంటి మాటలు విని మూర్తి చాలా బాధపడేవాడు తల్లి మనసు నొప్పించినందుకు పశ్చాత్తాపపడేవాడు కాని పట్టించుకోవడం మానేశాడు ఈమధ్య ఈ మధ్య అంటే విసుగెత్తిన లత నడుంకట్టి మొగుడి మెతకతనాన్ని కొంత వదిలించినప్పటి నుంచీ ఎవరో ఒకరు పూనుకొని కొంత సంస్కరించకపోతే ఈ మనిషిలో మార్పురాదని నిశ్చయానికొచ్చి, ఆమె ఓ రాత్రి మొగుడికి జ్ఞానబోధ చేసింది

'చూడండీ, కాసే చెట్టుకే రాళ్ల దెబ్బలు మీరు చేస్తారు కాబట్టి మరింత చేయించుకుంటారు ఎవరైనా చెయ్యడానికి మనకేం బాధలేదు ఎంతైనా చేస్తాం కాని చేసిన కొద్దీ చెడ్డవాళ్లం అవుతున్నాం గాని మన మంచితనానికి గుర్తింపుగాని మరేదీగాని లేదు ఇలా అంటున్నానని మరేం అనుకోకండి– ఉన్నమాట చెపుతున్నాను – అత్తగారికి ఎంత చేసినా సంతృప్తి లేదు. ఏదో ఒకటి అంటూనే ఉంటారు మిమ్మల్నీ నన్నూ! ఏదో విధిలేక ఆవిడా మీ తమ్ముడూ మన దగ్గరున్నట్టు, అంచేత మనం వాళ్లని చిన్నచూపు చూస్తున్నట్టూను! మళ్లీ ఇంట్లో ప్రతిదీ ఆవిడ ఇష్టప్రకారమే జరిపించుకుంటారు నోరుపెట్టి మీరు ఏవంటే అనండి గాని ఎల్లకాలం ఇలా అయితే కష్టం సుమండీ! అంది

మూర్తి మాట్లాడలేదు కాని ఆలోచించాడు

భర్త సుముఖత చూసి కొనసాగించింది లత 'ఏం? అంత మనం సొక్కనప్పుడు, ఏదీ వెళ్లి పెద్దకొడుకూ కోడలూ దగ్గర ఓ పది రోజులు ఉండమనండి, చూద్దాం! ఉహు, వెళ్లిన మూడో రోజునే తిరుగు ప్రయాణం, ఒంట్లో బాగులేదనో, నీళ్లు పడలేదనో, బాబిగాణ్ణి చూడాలనిపించిందనో సాకు పెట్టి! ఎవడిక్కావాలండీ, మీ పిచ్చిగాని!" అని ముగించింది

ఆ తర్వాత అప్పుడప్పుడు ఇలాంటి ప్రసంగాలు దంపతుల మధ్య జరిగాయి కొంచెం ధైర్యం నేర్చుకోమని, మన ఇష్టాయిష్టాలు పైకి చెప్పడం నేరం కాదని, ఎంత తల్లయినా ఎల్లకాలం కొడుకు మీద నిరంకుశత్వం కూడదని, మొగాడు ఇన్నేళ్లొచ్చి పెళ్లి, పిల్లలు, సంసారం ఏర్పడ్డాక అయినా స్వంత వ్యక్తిత్వం, స్వంత బుర్ర సంపాదించుకోవాలనీ – భర్తకి శతవిధాలుగా నూరిపోసింది లత ఆమె

## అయినవాళ్లు

కంఠశోషకి ఫలితం కనిపించకపోలేదు

అదిగో అప్పటి నుంచీ భార్య మాటల్లో నిజం, తల్లి ప్రవర్తనలో మూర్ఖత్వం, తన అసమర్థత స్పష్టంగా తేటతెల్లమవుతున్నాయి మూర్తికి కాని ఇన్నేళ్లుగా మెదడుకి పట్టిన తుప్పు అంత త్వరగా వదులుతుందా?

రాత్రి భోజనాలయ్యాక ఆకులు రాస్తూ చెప్పింది లత రేపు ఏకాశి ఉపోషం ఉండి, ఎల్లుండి ద్వాదశి బ్రాహ్మడికి భోజనం పెట్టుకుంటారట అత్తగారు

బ్రాహ్మడంటే వెంకన్న పంతులు పుట్టడం బ్రాహ్మణ కుటుంబంలో పుట్టేడు గాని వాడికి లేని దుర్వ్యసనాలు లేవని, వాడంత కర్మ చండాలుడు ఇంకొకడు లేడని, వాడికి భోజనం పెడితే పుణ్యంకాదు కదా, పాపం చుట్టుకుంటుందనీ ఇంతకు ముందే విశదంగా చెప్పేడు మూర్తి తల్లికి

వాడి పాపాన వాడే పోతాడు వాడు ఎక్కడో ఏదో చేస్తాడని, ద్వాదశి పారణ చేసి బ్రాహ్మడికి కాకపోతే మరో కులం తక్కువ వాడికి భోజనం పెట్టుకుంటావుట్రా? అని బుగ్గలు నొక్కుకుంది ఆవిడ

'ఏం ఎందుకు పెట్టకూడదు? బ్రాహ్మడికంటె మరో కులపువాడు ఎందులో తక్కువ? అని మూర్తి ఎప్పుడూ అడగలేకపోయాడు అడిగే దమ్ముల్లేవు అతడికి

'పోనీ, వాడొక్కడే ఉన్నాడా లోకంలో బ్రాహ్మడు? ఇంకెవడినో పిలవకూడదా?' అని చూశాడు

"బావుందిరా మీ నాన్నగారు ఉన్నప్పటి నుంచీ వాణ్నే పిలుస్తున్నాం ఏ కార్యానికైనాను ఇన్నాళ్లూ పనికొచ్చిన వాడు ఇప్పుడు చేదైపోయేడా? నీవి మరీ విపరీతపు మాటలు కాకపోతే!' అని కోప్పడింది ఆవిడ

మూర్తి నోరు మూసుకున్నాడు ఆవిడతో వాదించి ప్రయోజనంలేదు 'తివిరి ఇసుమున తైలంబు దీయవచ్చు' కాని కన్నతల్లి 'సెంటిమెంటు అతడి తెలివితేటల్ని, లోకజ్ఞానాన్ని నోరు నొక్కేసింది

చెయ్యని అన్నాడు మూర్తి, భార్యతో


మన ఇంట్లో మనకి ఇష్టంలేని పనులు జరుగుతున్నా అవి ప్రయోజనం లేనివని తెలిసినా ఏమీ చెయ్యలేం తప్పదు పెద్దవాళ్ల మనసులు బాధ పెట్టడం ఇష్టంలేక మూఢాచారాల్ని, పాతకాలపు పద్ధతుల్నీ కొనసాగనిస్తున్నాం మన ఇంట్లోనే కాదు, ఎక్కడా అలాగే ఉంది సెంటిమెంట్ల బురదలో కూరుకుపోయాక లాజిక్కు, రీజను పనిచెయ్యవు నిట్టూర్చాడు మూర్తి అతడికి తను కాలేజీ రోజుల్లో చదువుకున్న తిలక్ కవిత్వంలో కొన్ని వాక్యాలు గుర్తుకొచ్చాయి

'వీళ్లందరూ సగం సగం మనుష్యులు
మరో సగం మరుగుపడిన భయస్తులు బాధాగ్రస్తులు
వీళ్లందరూ ముక్కలైన గాజుపెంకులు
చెల్లాచెదురైన మూగ ముత్యాలు
కల్లా కపటం తెలియని కబోది గుంపులు
తమని తామే మోసగించుకునే విధ్యాధికులు విదూషకులు
తమ చెట్టు కొమ్మని తామే నరుక్కునే అమాయకులు సంప్రదాయకులు

'మమ' అనుకున్నాడు మూర్తి, ముక్కూ చెవులూ పట్టుకుని, ఆ తర్వాత కళ్లు మూసుకుని నిద్రకుపక్రమించాడు

* * * * *

పొద్దున్న మూర్తి ముందు గదిలో కూర్చుని షేవ్



చేసుకుంటూ ఉండగా వచ్చాడు హరిప్రసాద్ ఇద్దరూ ఒకే ఆఫీసులో ఒకే కేడరు గుమస్తాలు అంతేకాక ఒకరి కష్టాలకి మరొకరు సానుభూతి చూపించే సహృదయులు

మామూలు పలకరింపులు అయ్యాక వచ్చిన విషయం బయటపెట్టాడు హరిప్రసాద్ మూర్తిగారూ! మీ పరిస్థితీ బాగుండదని తెలుసుగాని ఒకవేళ వీలైతే మీ దగ్గరుంటేనే సుమండీ అర్జంటుగా ఎనభై రూపాయలు కావాలి అన్ని సోర్సెసూ ప్రయత్నించాను ఈసారి ఏమిటో మన జాతకం సమయానికి ఎవరి దగ్గరా లేవు

మూర్తి నీరసంగా చిరు నవ్వు నవ్వాడు మా తమ్ముడి పరీక్ష ఫీజు కట్టడానికి ఇవాళే ఆఖరు రోజు నాకూ ఇంతవరకు ఏదీ జతపడలేదు ' గొంతు తగ్గించి కొనసాగించాడు ఇవాళ ఓ చోట దొరికే అవకాశం ఉంది లెండి ఎక్కడో చెప్తే ఆశ్చర్యపోతారు – మన మేనేజరుకే వేశాను ఇంతకుముందే చెప్పి ఉంచేన్లెండి. ఈ అవసరం కోసం అలాగే తీసుకెళ్లమన్నాడు ఇవాళ మరెందుకు. వీలైతే టూ హండ్రెండ్సు ఇమ్మంటాను మనిద్దరికీ సరిపోతుంది అన్నాడు

హరిప్రసాద్ కృతజ్ఞతా పూర్వకంగా చూశాడు

మూర్తికీ మనసు బాగుంది తను ప్రసాద్‌కి సహాయం చెయ్యగలిగితే బాగుంటుంది అతను ఇంకా అవివాహితుడు కావడం వల్ల అతనే తనకి తరచుగా సాయం వేస్తుంటాడు ఇప్పుడు ఋణం తీర్చుకునే అవకాశం వచ్చింది

ఒరే బాబీ రహస్యంగా పిలిచాడు కొడుకుని. తల్లి వినకుండా

వాడొచ్చాడు చేతిలో పలకతో

వొంటింట్లో మీ అమ్మ ఉందా నాయనమ్మ ఉందా. చూసిరా అని పంపించాడు

అమ్మే ఉంది నాన్నా నాయనమ్మ పెరట్లో ఉంది అన్నాడు వాడు. చూసి వచ్చాక

అయితే మామయ్యగారికి కొంచెం కాఫీ చేసిమ్మని చెప్పు అమ్మతో వేగం రావాలి అని తొందరపెట్టేడు

హరిప్రసాద్ వాళ్లింటికి రావడం మూర్తి తల్లికి ఇష్టంలేదు దానికి – పూర్వం జరిగిన సంఘటన ఒకటి కారణం

బాబిగాడి గత పుట్టిన రోజుకి హరిప్రసాద్‌ని భోజనానికి పిలుద్దామనుకున్నాడు మూర్తి ఇంట్లో ఆడవాళ్లిద్దరూ దానికేం భాగ్యం, అలాగే పిలవమన్నారు మధ్యాహ్నం కూర్చుని ఏమేం వంటలు చెయ్యాలో ఆలోచించుకుంటూంటే మూర్తి తమ్ముడు వచ్చి విషయం తెలుసుకున్నాడు హరిప్రసాద్ గార్నినా? అమ్మా నువ్వొప్పుకున్నావూ? అతను షెడ్యూల్ కేస్టు తెలుసా? అనడిగేడు

ఆఁ! అని నిర్ఘాంతపోయింది తల్లి

సాయంకాలం ఆఫీసు నుండి రాగానే మూర్తికి నెత్తిన బాగా అక్షింతలు పడ్డాయి ఎలా పుట్టేవురా

# అయినవాళ్ళు

బ్రాహ్మణ పుట్టుక? ఏ ఒటేల్లోనో ఏదో అఘోరించక ఇంటిక తీసుకొచ్చి. నీ పక్కని పీట వేసి కూచోబెట్టి వొడ్డించాలని నీకెలా అనిపించిందిరా? పాపం అనేనా తో చలేదా? ఇదుగో చెబుతున్నాను – నేను చచ్చేక నా తలకొరివి పెట్టి, అప్పుడు చెయ్యి ఇలాంటి అపభ్రంశ పనులు! ఇంటో నా మటం ఉన్నంతవరకు ఇలాటి నీతి తక్కువ పనులూ జాతి తక్కువ పనులూ నేను సహించను తెలిసిందా? అంటూ ఝుణాయించేసింది

మర్నాడు హరిప్రసాద్‌కి ఏదో విధంగా సర్ది చెప్పుకున్నాడు మూర్తి అతడు నవ్వి ఊరుకున్నాడు ఆ సంఘటనతో మూర్తికి ప్రసాద్ పట్ల స్నేహభావం మరింత పెరిగిందే గాని తగ్గలేదు

ఆ తర్వాత ఒకటి రెండుసార్లు హరిప్రసాద్ మూర్తి ఇంటికి వచ్చినా ముందు గదిలోకే ప్రవేశం మహా అయితే గ్లాసుడు మంచినీళ్ళు అతడికి ఆతిథ్యం ఆ గ్లాసు పనిమనిషి చేత తోమించి, తను మళ్ళీ మడినీళ్ళు చిలకరించి కడుక్కుని ఇంట్లో పెట్టుకునేది ముసలమ్మగారు

ఒకవేళ బై ఎనీ మిస్ చాన్స్. ఈ ప్రయత్నం ఫెయిలయితే – మీకు ఇవాళే అవసరమా? 'అనడిగాడు మూర్తి

ఔనండీ! నా అవసరమూ మీ అవసరమూ ఒకటే నాకూ మా తమ్ముడి ఫీజు కట్టడానికే వీలైతే చూడండి లేకపోతే ఆఫీసుకెళ్ళేక ఇంకేదైనా ప్రయత్నం చేద్దాం ఇవాళ కాకపోతే రేపు ఫైనుతో కట్టాలి! మరో పది రూపాయలు అన్నాడు హరిప్రసాద్ కాఫీ తాగి "ఫస్టు మరి అని చెప్పి బయలుదేరాడు

★ ★ ★ ★

ఆఫీసు కెళ్ళాక మేనేజర్ని కలిసి డబ్బు విషయం కదిపాడు మూర్తి అయితే ఆయనకీ అనుకోని ఖర్చేదో వచ్చి పడిందట 'నీ కిస్తానని కమిట్ అయ్యాను కాబట్టి ఓ వంద అయితే సర్దగలనోయ్' అంతకంటె ఎక్కువ కష్టం అన్నాడు

మూర్తి సరేనని పుచ్చుకున్నాడు

ఆ డబ్బు తమ్ముడి కివ్వడమా హరిప్రసాద్ కివ్వడమా ఒక్కక్షణం సేపు ఆలోచించాడు హరిప్రసాద్ కిస్తేనే అది సద్వినియోగమవుతుందనిపించింది అతనికి త్వరగానే నిర్ణయానికి వచ్చాడు

ఆ డబ్బు తీసుకెళ్లి హరిప్రసాద్ కిచ్చి వచ్చాడు

★ ★ ★ ★

సాయంకాలం యుద్ధానికి సిద్ధపడే వచ్చాడు మూర్తి రాగానే చెప్పనే చెప్పింది లత తను మరి డబ్బు ఇవ్వడని తల్లీ తమ్ముడూ ఒక నిర్ణయానికి వచ్చేశారట అందుకని ఆవిడ తన మెళ్లో ఉన్న ఒంటిపేట గొలుసు తీసి చిన్నకొడుకు చేతికిచ్చేసిందట ఇస్తూనూ. ఇచ్చేక గంట సేపటి దాకానూ ఏదో వల్లిస్తూనే ఉందట అది పట్టుకుని వెళ్లిపోయాడట అతని తమ్ముడు నేను ఏమంటే ఏం జరుగుతుందోనని నేనేమీ కల్పించుకోలేదు నిన్న చెప్తే మీరు ఉందనీ లేదనీ ఏమీ మాట్లాడలేదు నేను మాత్రం ఏం చెయ్యను? ఆవిడకి నా మీద కూడా పీకల్దాకా ఉంది ఇందాకా కాఫీ చేస ఇస్తే తాగలేదు అంది లత

మూర్తి దీరహంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు

"చూడండి! ఇన్నాళ్ళు ఇంత చేసీ చివరికి మీకు ఎలాంటి ముద్ర పడిందో! మీరు డబ్బు ఇవ్వకపోబట్టే కద, ఆవిడ తన మెళ్లో గొలుసు తీసి ఇవ్వాల్సి వచ్చింది! అంది లత మళ్ళీ, బాధగా

"పోనీలే, ఫర్వాలేదు సద్వినియోగమే అయింది కద! పోయేటప్పుడు పట్టుకుపోతుందా ఏమిటి ఆ గొలుసు? తన కొడుకు అవసరానికే పనికొచ్చింది కద అన్నాడు, మూర్తి పొడిగా

కాని లోకం ఏమనుకుంటుంది? ఈవిడ ఈ పని చేసి ఊరుకుంటారా? రేపటి నుంచి ఊరంతా మీ మీదా నా మీదా ప్రచారాలో! ఆందోళన వ్యక్తమైంది ఆమె గొంతులో

'కానీ! ఇంకా ఏమేం కావాలో!' అన్నాడు మూర్తి

రాత్రి మూర్తి తమ్ముడు వచ్చి తను సేకరించిన సమాచారమంతా తల్లికి వివరంగా చెప్పేడు "అన్నయ్య ఇవాళ వాళ్ల మేనేజరు దగ్గర అప్పు తీసుకున్నాడట తీసుకుని ఆ హరిప్రసాద్‌గారి తమ్ముడి ఫీజు కట్టడానికి అతనికిచ్చాడట అంటే నా పరీక్ష ఫీజు కట్టడం ఇష్టం లేకే కదా! ఇప్పటికైనా తెలిసింది కదా వీళ్లకి నీ మీదా నా మీదా ఎంత అభిమానం ఉందో అని మెల్లి మెల్లిగా పురెక్కించాడు

ముసలావిడ మాత్రం మెల్లిగా మాట్లాడలేదు పడగదిలో ఉన్న కొడుకూ కోడలూ వినాలనే గట్టిగా, ఔను మరి! ఆ మాల వాటి చెయ్యలేదన్న మాట కన్నతల్లీ సొంత తమ్ముడూను! పిదప కాలం, పిదప బుద్ధులూను ఉట్టినే అన్నారా అయినవాళ్ళకి ఆకుల్లోనీ కానివాళ్ళకి కంచాల్లోనీ అని అని సణుక్కుంది

మూర్తి భార్యతో అంటున్నట్టుగా తల్లికి వినీవినిపించకుండా అన్నాడు 'ఆకులో కంచాలో. వేళకి వడ్డిస్తున్నవాళ్ళు ఉన్నందుకు సంతోషించాలి. అధికారాలు చలాయిస్తే అభిమానాలు ఎక్కువ్వించి పుట్టుకొస్తాయి "

ముసలావిడకి ఎదురు బాణం వెయ్యడానికి ఏమీ దొరక్క తనలో తను ఏదో గొణుక్కుంటూ ఉండిపోయింది □